ఊపందుకున్న వరి నాట్లు



ఏపుగా ఎదిగిన వరి నారుమడి



లంకలకోడేరులో పంట దమ్ము చేస్తున్న ట్రాక్టర్



దగ్గులూరులో వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

- 85 శాతం నారుమడులు పూర్తి
- 120 ఎకరాల్లో వరినాట్లు పూర్తి
- 10,200 ఎకరాల్లో సాగు
- చురుగ్గా దాళ్వా దమ్ములు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలంలో దాళ్వా నాట్లు, దమ్ములు, గట్లు సరిచేసుకోవడం, నేల చదును చేసుకునే పనిలో వ్యవసాయ కూలీలు, రైతులు ఉన్నారు. ఇప్పటికే 85 శాతం నారుమడులు పూర్తయ్యాయి. శివదేవుని చిక్కాల, తిల్లపూడి, బల్లిపాడు, దగ్గులూరు, లంకలకోడేరు, వెంకటాపురం, అరట్లకట్ట, వరిధనం, పాలమూరు, గవరపేట గ్రామాల్లో వరినాట్లు ప్రారంభమయ్యాయి. ఈ గ్రామాల్లో సుమారు 120 ఎకరాల్లో వరినాట్లు పూర్తి చేసినట్టు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మండలంలో 10,200 ఎకరాల్లో వరి భూములు సాగులో ఉన్నాయి. ప్రస్తుతం

120 రోజులకు దిగుబడి

పీఆర్ 126 వరి రకాన్ని ఎక్కువ మంది రైతులు సాగు చేస్తున్నారు. ఎంటీయూ 1121, ఎంటీయూ 1153, ఎంటీయూ 1156 రకం వరి వంగడాలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ వరి వంగడాలు 120 రోజుల్లో దిగుబడి వస్తాయి. సరైన నీటి యాజమాన్యం, ఎరువులు, కలుపు నివారణ తదితర యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటిస్తే ఎకరానికి 50 నుంచి 60 బస్తాలు దిగుబడి వస్తాయని అధికారులు చెబుతున్నారు.

ఎరువుల మోతాదు

దమ్ముల్లో మోడులు బాగా కుళ్లడానికి కి 2 కట్టలు సూపర్, 15 కిలోలు యూరియా వేసుకో వాలి. ఆఖరి దమ్ములో 2 కట్టలు పొటాష్, 15 కిలోల యూరియా వేసుకోవాలి. యూరియా ఎకరానికి 72 కిలోలు మూడు మోతాదులో అంటే దమ్ములో 14 కిలోలు, నాట్లు వేసిన 15 రోజులకు 14 కిలోలు, చిరుపొట్ట దశలో 14 కిలోలు వేసుకోవాలి. ముగుల నివారణకు ఆకుమడి దశలో ఫోర్ జీ గుళికలు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఈ క్రాప్, ఈకేవైసీ పూర్తి చేయాలి



మండలంలోని అన్ని సర్వే నెంబర్లు ఈ క్రాప్, ఈకేవైసీ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి. ఇది దాళ్వా పంట విక్రయించుకోవడానికి ఉపయోగపడుతుంది. లేని పక్షంలో దళారులకు పంటను విక్రయించుకోవాలి. ఈ క్రాప్, ఈకేవైసీ పూర్తి చేసిన సర్వే నెంబర్లు మాత్రమే సివిల్ సప్లయ్‌పోర్టల్‌లో కనిపిస్తాయి. వీటికే పంట రాయితీలు, ఇన్సూరెన్స్ వర్తిస్తాయి. రైతులు అశ్రద్ధ చేయవద్దు.

– కె.రాజశేఖర్, వ్యవసాయాధికారి, పాలకొల్లు

విద్యుదాఘాతానికి లారీ క్లీనర్ మృతి



మృతి చెందిన క్లీనర్ నాగేశ్వరరావు

పెద్దాపురం: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందినట్టు పెద్దాపురం ఎస్సై మౌనిక తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. మండలంలోని చినబ్రహ్మదేవం కేబీకే బయోటెక్ పరిశ్రమకు లారీలో సరకు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో లారీపై బరకాలను తొలగిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు మండలం మట్టపర్రు గ్రామానికి చెందిన క్లీనర్ పెచ్చెట్టి నాగేశ్వరరావు (60) అక్కడికక్కడే మృతి చెందాడు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

4 నుంచి వేంకటేశ్వరుని కల్యాణ మహోత్సవాలు



వేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాల కరపత్రం విడుదల చేసిన కమిటీ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: కలియుగ దైవం శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివార్ల దివ్య కల్యాణం 32వ వార్షికోత్సవాలు జనవరి 4 నుంచి మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం స్థానిక మేడికొండ శ్రీనివాసరావు కార్యాలయంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు కలిదిండి కృష్ణవర్మ మాట్లాడుతూ పట్టణంలో గత 31 సంవత్సరాలుగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. స్థానిక పెనుమదం రోడ్డులో ఉన్న ఆర్ఆర్ఆర్ రైస్ మిల్లులో జనవరి 4, 5, 6 తేదీల్లో స్వామివారి కల్యాణ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణోత్సవ విగ్రహాలతో కల్యాణం నిర్విస్తామన్నారు. 4వ తేదీ శనివారం ఉదయం 7 గంటలకు దేవరపల్లి రామకృష్ణ దంపతులచే గణపతి హోమం, సాయంత్రం 5 గంటలకు మంత్రి నిమ్మల రామానాయుడు దంపతులచే స్వామివారి దివ్య కల్యాణం, 5న ఆదివారం ఉదయం 7 గంటలకు సామూహిక సత్యదేవుని వ్రతాలు, లక్ష్మీనారాయణ ఫ్రూట్స్ వారిచే సత్యదేవుని హోమం, అన్నవరం నుంచి వచ్చిన సత్యదేవుని వ్రత రథం, పురోహితులు ఆధ్వర్యంలో 2 వేల కలశాలతో సత్యదేవుని వ్రతం, అన్నసమారాధన మధ్యాహ్నం 11 గంటల నుంచి తాటిపాక కృష్ణ గురుస్వామిచే భజన కార్యక్రమం, 6వ తేదీ సోమవారం నమ్మిరాజు, బొంతు పెద్దిరాజుల దంపతులచే నవగ్రహ సుదర్శన అష్టదిక్పాలక హోమం అనంతరం పట్టణంలో స్వామివారి బ్రహ్మోత్సవ ఊరేగింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గురుస్వామి యాదంరెడ్డి సత్యం, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుంపట్ల నాగ శ్రీనివాసు, కాటంరెడ్డి సత్యనారాయణ, బీరక ప్రసాద్, టంగుటూరి నాగేశ్వరరావు, గాధంశెట్టి సత్యనారాయణగుప్త తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు ఏఎస్ఎన్ఎం విద్యార్థి



విద్యార్థి శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పాలకొల్లు సెంట్రల్: ఏపీ రాష్ట్రస్థాయి పురుషుల సీనియర్ వాలీబాల్ జట్టుకు స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికయ్యాడు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ ఈ నెల 27న ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన సీనియర్స్ వాలీబాల్ రాష్ట్రస్థాయి జట్టుకు తమ కళాశాల బీఏ ఎకనామిక్స్ మొదటి సంవత్సరం విద్యార్థి గుబ్బల శ్రీనివాస్ ఎంపికయ్యాడని తెలిపారు. జనవరి 7 నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.భద్రాచలం, వ్యాయామ విద్యా అధ్యాపకులు జి.మహేష్, విద్యార్థులు అభినందించారు. కళాశాలలో ప్రముఖ కవి మరియు నాటక కర్త రోదియాడ్ కిప్లింగ్ 159వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి కిప్లింగ్ జీవిత చరిత్ర, అతని రచనలను విద్యార్థులకు వివరించారు.

వంతెనకు అప్రోచ్ పూర్తయ్యేదెన్నడో?

- జిన్నూరులో పదేళ్ల క్రితం వంతెన నిర్మాణం
- గ్రామస్తుల ఎదురుచూపులు



జిన్నూరులో నరసాపురం ప్రధాన కాలువపై నిర్మించిన వంతెన

పోడూరు: జిన్నూరు గ్రామంలో నరసాపురం ప్రధాన కాలువపై వంతెన నిర్మించి పదేళ్లయినా అప్రోచ్ పనులు పూర్తికాలేదు. దీంతో వంతెన నిరుపయోగంగానే ఉంది. వంతెనకు అప్రోచ్ ఈ ఏడాదైనా పూర్తవుతుందని, కొత్త వంతెనపై 2025 ఏడాదిలోనైనా రాకపోకలు సాగించవచ్చని ప్రజలు ఎదురుచూస్తున్నారు. జిన్నూరులో నరసాపురం ప్రధాన కాలువపై గతంలో బ్రిటీషువారి హయంలో నిర్మించిన పాత ఇనుప వంతెన శిథిల దశకు చేరుకుంది. ఆ వంతెన ఇరుకుగా కూడా ఉండడంతో దాదాపు పదేళ్ల క్రితం వంతెన నిర్మించారు. ఈ వంతెనకు ప్రధాన గ్రామం వైపు అప్రోచ్ పనులు పూర్తికాకపోవడంతో అది ప్రారంభానికి నోచుకోలేదు. మూడేళ్ల కిందటే దాదాపుగా రూ.1.20 కోట్ల వ్యయంతో అప్రోచ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. అప్రోచ్‌కు పక్కగా ఆర్ ఆర్ వాల్ నిర్మించేందుకు కాంక్రీటు బ్లాకులు మాత్రమే తయారు చేశారు.

ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు

అప్రోచ్ లేక వంతెన ప్రారంభం కాకపోవడంతో ఇరుకుగా ఉండే పాత వంతెనపై వాహనాలు, ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండి నిత్యం ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. ఉదయం, సాయంత్ర వేళల్లో ఈ మార్గంలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల రాకపోకలు సాగిస్తుంటారు. పలు సార్లు ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు, ప్రజలు నరకయాతన పడుతున్నారు. త్వరగా అప్రోచ్ రోడ్డు నిర్మించి గ్రామంలో ట్రాఫిక్ సమస్యను అరికట్టాలని జిన్నూరు గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ కె.శ్రీనివాస్‌తో మాట్లాడగా అప్రోచ్ పనులు పూర్తి చేయకపోవడంపై సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసు ఇచ్చామన్నారు. జనవరిలో పనులు ప్రారంభిస్తానని కాంట్రాక్టర్ చెప్పినట్టు ఏఈ తెలిపారు.

అప్రోచ్ త్వరగా పూర్తి చేయాలి



జిన్నూరులో వంతెన నిర్మించినా అప్రోచ్ లేకపోవడంతో వంతెన పదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. నరసాపురం – మార్టేరు రహదారి నుంచి ప్రధాన గ్రామానికి ప్రయాణికులు, గ్రామస్తుల రాకపోకలు సాగిస్తుంటారు. పాత వంతెన ఇరుకుగా ఉండడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే అప్రోచ్ నిర్మించేలా చర్యలు చేపట్టాలి.

– కొప్పుర్తి నర్సింహమూర్తి, సీపీఎం గ్రామ కార్యదర్శి

ఎమ్మార్వీకి సాహిత్య రత్న పురస్కారం



పురస్కారం అందుకొంటున్న ఎమ్మార్వీ

పెనుగొండ: స్థానిక కవి, కథా నటక, నవలా రచయిత ఎమ్మార్వీ సత్యనారాయణ మూర్తి సాహిత్య రత్న జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకొన్నారు. ఈ మేరకు సోమవారం ఉదయం పెనుగొండలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ముదిగొండలో జరిగిన పుడమి జాతీయ వేదిక సభలో పురస్కారం అందుకొన్నట్టు చెప్పారు. వృక్ష ప్రేమికులు పద్మశ్రీ పి.రామయ్య, భక్త రామదాసు పదవ వారసులు కంచర్ల శ్రీనివాస్, పుడమి జాతీయ అధ్యక్షుడు సీహెచ్ బాల్‌రెడ్డి, మానవ హక్కుల పరిరక్షణ సమితి ఛైర్మన్ సీహెచ్ హైమావతి, అన్నం ఫౌండేషన్ ఛైర్మన్ ఎ.శ్రీనివాసరావుల చేతుల మీదుగా అందుకొన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్వీని ఎస్వీకేపీ విద్యా సంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ కె.రామచంద్రరాజు, త్యాగరాజు గాన సభ అధ్యక్షురాలు కె.అన్నపూర్ణ, పలువురు ప్రముఖులు అభినందించారు.

భూ సమస్యలకు పరిష్కారం



మేడపాడు సదస్సులో అర్జీ అందిస్తున్న రైతు

యలమంచిలి: ఏన్నో ఏళ్ల నాటి భూసమస్యలు రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారమవుతున్నాయని డిప్యూటీ తహసీల్దార్ పి.డేవిడ్‌సన్ అన్నారు. మండలంలోని మేడపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులో పట్టాదార్ పాస్ పుస్తకాల కోసం 3, రీప్లేస్‌మెంట్ పాస్ పుస్తకం కోసం 1, విస్తీర్ణంలో తేడాలు సరిజేతకు 1, జాయింట్ ఎల్‌పీఎం స్ప్లిట్టింగ్ కోసం మూడు కలిసి మొత్తం 8 దరఖాస్తులు రైతులు అందజేశారు. గ్రామ సర్పంచ్ పి.విష్ణుప్రియ, ఏనుగువానిలంక నీటి సంఘం అధ్యక్షుడు ఎండీవీ సత్యనారాయణ, వీఆర్వోలు ఎస్ లక్ష్మి, కె.రమేష్, సర్వేయర్లు ఎ.రామరాజు, సురేష్, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

స్థల సర్వే కోరుతూ ఫిర్యాదు

మొగల్తూరు: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో శేరేపాలెంకు చెందిన కత్తుల సత్యనారాయణ తన స్థలాన్ని సర్వే చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశారని తహసీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ త్రిశూల పాణి, పీఆర్ఏఈ ఈ వెంకటేశ్వరరావు, ఏఓ రహీమ్, ఎంఈఓ శామ్యూల్ జాన్, సర్వేయర్ ధన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి



అంబేద్కర్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

నరసాపురం: బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ప్రపంచానికే దిక్సూచి లాంటి మేటి రాజ్యాంగాన్ని దేశానికి అందించిన అంబేడ్కర్‌పై షా దారుణంగా మాట్లాడారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీతో అంటకాగుతున్న కూటమి నాయకులు కనీసంగా కూడా అమిత్‌షా వ్యాఖ్యలను ఖండించకపోవడం దారుణమని తెలిపారు. షా కు మంత్రిగా కొనసాగే అర్హత లేదని, ఆయనను వెంటనే మంత్రివర్గం నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నోముల కొండ, కోరాడ బద్రి, గుత్తుల రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

షా వ్యాఖ్యలు సరికాదు

పోడూరు: పార్లమెంట్‌లో హోంమంత్రి అమిత్ షా బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేయడం సమంజసం కాదని సీపీఎం మండల కార్యదర్శి కాకర వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు వెంకటేశ్వరరావు, పిల్లి ప్రసాద్ మాట్లాడారు. నాయకులు బూరాబత్తుల వెంకట్రావు, మల్లుల గణపతి, బొంతు శంకరం, మాలమహానాడు మండల గౌరవాధ్యక్షుడు బుడితి భీమారావు, తాడిపర్తి కిరణ్, దాసి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

పెనుగొండ: పెనుగొండ జిలం చెరువు రహదారి నిర్మాణ పనులను సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి సోమవారం పరిశీలించారు. గత దశాబ్ద కాలంగా గోతుల మయంగా మారిన ఈ రోడ్డు నిర్మాణ పనులను ఇటీవల ప్రారంభించారు. ఈ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దాతలు

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతోపాటు ప్రభుత్వం, దాతల ప్రోత్సాహం కూడా ఉంటుందని కాశీనాథుని శేషగిరి అన్నారు. సోమవారం స్థానిక ఎంఎంకేఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా శేషగిరి మాట్లాడుతూ తమ తండ్రి లక్ష్మీనరసింహం ఇదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేశారని, తాము కూడా ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేశామని తెలిపారు. ఈ పాఠశాలలో చదువుకుని నేడు అమెరికాలో స్థిరపడ్డానని చెప్పారు. ఇక నుంచి ప్రతి ఏటా మొదటి మూడు స్థానాలు సాధించిన పదో తరగతి విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ ఏడాది మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ఆర్ యశ్వంత్ నాయుడు, కె.రోహిత్, జె.దివ్యలకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు నగదు, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అడ్డాల సత్యనారాయణ (నాని), దాత కుటుంబ సభ్యులు కాశీనాథుని లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నారుమడుల పరిశీలన



నారుమడులను పరిశీలిస్తున్న ఏఓ అబ్దుల్ రహీమ్

మొగల్తూరు: మొగల్తూరు గ్రామంలోని నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం తదితర ప్రాంతాల్లో మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సోమవారం పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచిన నారుమడులను ఆయన పరిశీలించారు. మడుల్లో నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు బయటకు తోడాలని రైతులకు సూచించారు. చలి వాతావరణంలో నారు ఎదుగుదల తక్కువగా ఉంటుందని, ఎక్కువ రోజులు నీరు నిలిచి ఉంటే 5 సెంట్ల నారుమడికి 2 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వెదజల్లాలని తెలిపారు. ముదురు నారుతో నాట్లు వేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు.

హైందవ ధర్మ ట్రస్ట్ కన్వీనర్‌గా అన్నపూర్ణ



కాశీ నాగ అన్నపూర్ణ

పాలకొల్లు అర్బన్: శ్రీ ఓం హైందవ ధర్మ ట్రస్ట్ రాష్ట్ర కన్వీనర్‌గా పాలకొల్లు పట్టణానికి చెందిన నడింపల్లి కాశీ నాగ అన్నపూర్ణను నియమిస్తూ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కర్ణ మురళీ కృష్ణ నాయుడు ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులు సోమవారం అన్నపూర్ణ అందుకున్నారు. హిందువుగా అనునిత్యం హిందూ దేవుళ్లు, దేవతలను రక్షిస్తూ గోమాతను పూజించి రక్షించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గడ్డి వాములు దగ్ధం



కరుగోరుమిల్లిలో కాలిపోతున్న గడ్డివాములు

పెనుగొండ: ఆచంట మండలం కరుగోరుమిల్లి ప్రభలు తీర్థ పుంతలో ఆరు గడ్డిమేట్లు ఆదివారం అర్ధరాత్రి తరువాత అగ్నికి ఆహుతయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించినట్టు రైతులు చెబుతున్నారు. దాదాపుగా 32 ఎకరాల గడ్డిమేటు తగలబడిపోవడంతో ప్రభుగ్రాసం బూడిదగా మారిందంటూ వాపోయారు. పాలకొల్లు నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించినా ఫలితంలేకపోయింది. గడ్డి విలువ రూ.5 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ ఘటనపై రైతులు దొమ్మేటి సత్యనారాయణ, చింతపల్లి నాగరాజు, కొప్పిశెట్టి వరప్రసాద్, బొర్ర సూర్యనారాయణ, దొమ్మేటి వీరాస్వామిలు ఆచంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

టీసీఎస్‌లో చాంబర్స్ విద్యార్థులు



విద్యార్థులను అభినందించిన కళాశాల ఛైర్మన్, ప్రిన్సిపాల్

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు టీసీఎస్‌లో ఉద్యోగాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక కళాశాల ఆవరణలో విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు క్రమశిక్షణ, అకుంటిత దీక్ష, సాంకేతిక నైపుణ్యంలో పట్టు సాధించే విధంగా కళాశాలలో రోజువారి తరగతులు బోధిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చెప్పారు. పట్టుదల, నిబద్ధతతో విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంలో మంచి ప్రావీణ్యత సాధించారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కేవీఆర్ నరసింహరావు, అడ్వైజర్స్ ఏబీఎస్ మూర్తి, నందుల సీతారామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకున్న ఉపాధ్యాయిని శ్రీదేవి

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లుకు చెందిన యనమదల శ్రీదేవి డాక్టరేట్ అందుకున్నారు. ఆమె యలమంచిలి మండలం కాజ గ్రామంలోని అంబాల చెరువు గట్టు పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి వద్ద ఆమెకు డైస్ప్రింగ్ అమెరికన్ యూనివర్సిటీ నుంచి ఆనరరీ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆమె రాసిన అనేక కవితలు, పాఠశాలలో విద్యార్థులకు బోధించే విద్యావిధానంపై మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ వావ్ టాలెంట్ అవార్డు, శివనంది అవార్డులను అందజేశారు. సోమవారం ఆ వివరాలను శ్రీదేవి వెల్లడించారు.

నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

నరసాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటుచేశామని ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ బడ్జెట్‌ను ప్రవేశపెడతామని పేర్కొన్నారు. 12 గంటలకు సాధారణ సమావేశం ఉంటుందని తెలిపారు. సభ్యులంతా విధిగా హాజరుకావాలని కోరారు.

5న సంక్రాంతి సంబరాలు

నరసాపురం: నరసాపురం నియోజకవర్గ కాపుసంఘం ఆధ్వర్యంలో జనవరి 5న సీతారామపురం లేసుపార్కు పక్కన ఉన్న తోటలో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్టు సంఘ కన్వీనర్ కోటిపల్లి సురేష్ తెలిపారు. డిసెంబర్ 1న నిర్వహించాల్సిన కార్తీక వన సమారాధన తుఫాన్ కారణంగా రద్దవ్వడంతో ఈ కార్యక్రమాన్ని సంక్రాంతి సంబరాలుగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గతంలో ప్రకటించిన అన్ని ప్రోగ్రామ్స్ ఉంటాయని వివరించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

నరసాపురం రూరల్: నరసాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మైలాబత్తుల సోని అధ్యక్షతన మంగళవారం ఉదయం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, సచివాలయ కార్యదర్శులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యం



గుబ్బల వీరబ్రహ్మం



దిద్దే శ్రీనివాస్

పోడూరు: మండలంలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గుబ్బల వీరబ్రహ్మం, ఆర్గనైజింగ్ కార్యదర్శి దిద్దే శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. పోడూరులో సోమవారం వారు మాట్లాడుతూ తమకు జిల్లా కార్యవర్గంలో పదవులు ఇవ్వడం పట్ల పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు, జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మం, శ్రీనివాస్‌లకు జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.